రోడ్లు ఇలా.. ప్రయాణం సాగేదెలా?

- అధ్వానంగా అలివేరు, సూర్పవారిగూడెం, అంతర్వేదిగూడెం రోడ్లు
- నరకయాతన పడుతున్న ప్రయాణికులు, వాహనచోదకులు


సూర్పవారిగూడెం నుంచి అంతర్వేదిగూడెం వెళ్లే రహదారి తవ్వి వదిలేసిన దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలో రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడికక్కడ గోతులమయంగా మారడం, రాళ్లు పైకి లేచి ఉండడంతో నానా అవస్థలు పడుతున్నారు. అధ్వానంగా ఉన్న అలివేరు రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దొరమామిడి డ్యామ్ కాలనీ నుంచి కొత్త అలివేరు వరకూ రోడ్డు శిథిలం కావడంతో కనీసం ద్విచక్రవాహనాలపై కూడా ప్రయాణం చేయలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. అదేవిధంగా దొరమామిడి నుంచి గుబ్బల మంగమ్మ తల్లి జల్లేరు జలాశయం వరకూ కూడా రహదారి అస్తవ్యస్తంగా మారింది. ఈ రహదారులకు కనీస మరమ్మతులను చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

తవ్వారు.. వదిలేశారు

మండలంలోని సూర్పవారిగూడెం నుంచి అంతర్వేదిగూడెం వెళ్లే రహదారి ఇటీవల మరమ్మతులు చేసేందుకు రోడ్డును జేసీబీతో తవ్వారు. అయితే పనులు చేపట్టకుండా వదిలివేయడంతో రాళ్లు పైకి లేచి ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటేనే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి. ప్రతి ఆదివారం, మంగళవారం గుబ్బల మంగమ్మ గుడికి అధిక సంఖ్యలో భక్తులు వాహనాలపై వెళ్తూ ఉంటారు. అధ్వానంగా ఉన్న ఈ రహదారిపై ప్రయాణం చేయలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా రేగులకుంట, నాగులగూడెం, అంతర్వేదిగూడెం, పందిరిమామిడిగూడెం, బూరుగువాడ, కామవరం తదితర గ్రామాల గిరిజనులు ఈ రహదారి నుంచే జంగారెడ్డిగూడెం ఆస్పత్రులకు, షాపింగ్‌కు, నిత్యావసరాల కొనుగోలుకు ప్రయాణం చేస్తూ ఉంటారు. ఈ రహదారిని తవ్వి వదిలివేయడం వల్ల రాళ్లు లేవడమే కాకుండా దుమ్ము కూడా లేస్తుందని దీనివల్ల ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

కాపవరం రోడ్డు అధ్వానమే

మండలంలోని కాపవరం నుంచి గుళ్లపూడి వరకూ వెళ్లే రహదారి కూడా అధ్వానంగా మారింది. ఈ రహదారిపై ప్రయాణం చేయలేక గిరిజనులు అవస్థలు పడుతున్నారు. కాపవరం, కుమ్మరికుంట, రాచూరు, లంకాలపల్లి, గుళ్లపూడి గ్రామాల సమీపంలో అత్యధికంగా వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. ఆయా గ్రామాల గిరిజనులతోపాటు రైతులు కూడా అవస్థలు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రహదారుల మరమ్మతులను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణం చేయలేకపోతున్నాం



దొరమామిడి నుంచి అలివేరు వరకూ ప్రయాణం చేయాలంటే నరకం చూస్తున్నాం. మరమ్మతులు చేపట్టాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే లేడు. కనీస మరమ్మతులను చేపట్టి మాకు రహదారి ఇబ్బందులు కలుగకుండా అధికారులు కృషి చేయాలి.

– కారం రాఘవ, న్యూడెమోక్రసీ నాయకుడు, అలివేరు

రోడ్డు పనులు పూర్తి చేయాలి



సూర్పవారిగూడెం నుంచి అంతర్వేదిగూడెం వెళ్లే రహదారి ఇటీవల తవ్వి వదిలేశారు. దీనివల్ల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఎందుకు తవ్వారో ఎందుకు వదిలేశారో అర్థం కావడంలేదు. వెంటనే ఆ పనులను పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలి.

– వెట్టి పెంటమ్మ, మాజీ ఎంపీటీసీ, కాకులవారిగూడెం

ఐఏఎస్ అధికారి నియామకానికి కృషి


కొయ్యలగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మనోహర్


కొయ్యలగూడెం: ఐటీడీఏకి ఐఏఎస్ అధికారి నియామకానికి కృషి చేస్తా అని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. సోమవారం పోలవరంలో సీఎం మీటింగ్‌కి హాజరైన ఆయన తిరుగు ప్రయాణంలో రోటరీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఐఏఎస్ అధికారిని పీఓగా నియమించడం వలన పూర్తిస్థాయిలో గిరిజనాభివృద్ధికి అవకాశం కలుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఈ సందర్భంగా రైతు సమస్యలను మంత్రి దష్టికి తీసుకువెళ్లారు. కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి గొలిశెట్టి శ్రీనివాస్ మనోహర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్థానిక నేతలు బోడిపిండి సుబ్రహ్మణ్యం, బొల్లిన నిర్మలా కిషోర్, కాసగాని గోకలే తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు


ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు వివరిస్తున్న సైంటిస్ట్

బుట్టాయగూడెం: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చునని కేవీకే వెంకటరామన్నగూడెం హార్టికల్చర్ సైంటిస్ట్ డాక్టర్ రేఖ తెలిపారు. బుట్టాయగూడెంలో ఆయిల్‌పామ్ తోటలు సమగ్ర యాజమాన్యం ఫెర్టిగేషన్‌పై సోమవారం రైతులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. ఫెర్టిగేషన్ పద్ధతిలో నెలకు ఒకసారి 5 కేజీల యూరియా, 3 కేజీల సింగిల్‌సూపర్ ఫాస్ఫేట్, 5 కేజీల మురేట్ ఆఫ్ పొటాష్, 2.5 కేజీల మెగ్నీషియం, ఒక కేజీ సల్ఫేట్ బొరాన్ డ్రిప్ ద్వారా ఇవ్వాలని అన్నారు. అలాగే మొక్క మొదలు దున్నకూడదని చెప్పారు. 2–4డి 245టి మందు వాడకూడదని చెప్పారు. 40 నుంచి 50 ఆకులు ఉంచి కట్ చేయాలన్నారు. నీటికొరత ఉన్నచోట ఎక్కువ ఆకులు రాలిపోవడం, మగ గెలలు ఎక్కువ వచ్చి దిగుబడి తగ్గిపోవడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి నవీన, రైతులు కరాటం జానకిరామ్, బిక్కిన సత్యనారాయణ, మడకం జంపాలు, దొమ్మేటి జనార్థన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా సుబ్బారాయుడి ఊరేగింపు



ద్వారకాతిరుమలలో ప్రత్యేక వాహనంపై ఊరేగుతున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారు, డీజే సందళ్ల నడుమ యువకుల డ్యాన్స్‌లు

ద్వారకాతిరుమల: క్షేత్రంలో సుబ్బారాయుడి ఊరేగింపు వేడుక సోమవారం రాత్రి అట్టహాసంగా సాగింది. షష్ఠి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని విచిత్ర వేషధారణలు, తీన్మార్ డప్పువాయిద్యాలు, డీజే సందళ్లు, బాణసంచా కాల్పులు, యువకుల ఆనందోత్సాహాల నడుమ జరిగిన ఈ ఊరేగింపు కార్యక్రమం చూపరులకు కనువిందు చేసింది. ముందుగా సంతమార్కెట్ సమీపంలోని బ్రహ్మంగారి ఆశ్రమం వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం విశేష పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తిని ఉంచి క్షేత్ర పురవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. ప్రతి ఇంటి ముంగిట భక్తులు సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించి, తరించారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన కారు


ప్రమాదంలో ధ్వంసమైన దుకాణం

ద్వారకాతిరుమల: శ్రీవారి దర్శనార్థం క్షేత్రానికి వస్తున్న ఒక భక్తుడి కారు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి రోడ్డు పక్కనున్న పాన్ దుకాణంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో దుకాణంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం. గుంటూరుకు చెందిన ఒక భక్తుడు కుటుంబ సమేతంగా కారులో ద్వారకాతిరుమల క్షేత్రానికి వస్తున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా కారు అదుపుతప్పి పాన్ దుకాణంలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో షాపు నిర్వాహకురాలు దుకాణంలో లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో దుకాణంతో పాటు ప్రమాదానికి కారణమైన కారు ధ్వంసమైంది. ఎస్సై సుధీర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మహిళా చట్టాల అమలు తీరు దారుణం


కార్యక్రమంలో మాట్లాడుతున్న వన్‌స్టాప్ అడ్మిన్ నిర్మల

ఏలూరు (టూటౌన్): మహిళా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ ఈఏ నిర్మల అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్ స్టేడియం ఎదురుగా ఉన్న లేడీస్ క్లబ్‌లో మహిళా రక్షణ చట్టాలపై కార్యక్రమం శిక్షణ శిబిరం జిల్లా కోఆర్డినేటర్ సింగవరపు జ్యోతి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. అతిథి నిర్మల్ మాట్లాడుతూ మహిళలు అన్ని చోట్లా శారీరక, మానసిక, లైంగిక వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. గృహ హింస చట్టం–2005లో అమలులోకి వచ్చిందని, రక్షణ చట్టాల అమలు తీరు బాగోకపోవడంతో మహిళల పరిస్థితి దారుణంగా ఉందని వివరించారు. డీబీఆర్‌సీ ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఎం హేమలత మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టం–2006, లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ చట్టం–2012లపై మాట్లాడారు. న్యాయవాది బి.కృష్ణవేణి మాట్లాడుతూ స్త్రీ సమాన హక్కుల కోసం ఐక్యతతో పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ శిబిరంలో 40 మందికిపైగా మహిళలు, డీబీఆర్‌సీ రీజినల్ కోఆర్డినేటర్ రమాదేవి, వైస్ డైరెక్టర్ ఎన్ లక్ష్మి, డీబీఆర్‌సీ సిబ్బంది గోసాల ఝాన్సీ, బలే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు

చింతలపూడి: గొల్లగూడెం, పాచ్చపురం గ్రామాల్లో సోమవారం ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. గొల్లగూడెం గ్రామానికి చెందిన పిన్నిబోయిన వెంకాయమ్మ అనే మహిళ వద్ద నుంచి 2 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ఆమెను అరెస్ట్ చేశారు. అలాగే గొల్లగూడెం, పాచ్చాపురం గ్రామంలో పాత నాటు సారా కేసులో నిందితుడు పిన్నిబోయిన శ్రీనివాసరావును మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచి బైండోవర్ చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు.

28న అక్కినేనికి స్వరాంజలి


స్వరాంజలి ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): ప్రముఖ దివంగత చలనచిత్ర నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకొని ఈనెల 28న స్వరాంజలి నిర్వహిస్తున్నామని అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఆహ్వానపత్రిక విడుదల చేశారు. ఘంటసాల స్వరపీఠం వ్యవస్థాపక కార్యదర్శి ఎస్‌ఎం సుభాని మాట్లాడుతూ సర్ సీఆర్ రెడ్డి కాలేజీ ఆడిటోరియంలో శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు స్వరాంజలి ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో దేవినేని భాస్కరరావు, చైల్డ్ రైట్స్ కమిషన్ మెంబర్ జె.రాజేంద్ర, మేతర అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు వెంటనే ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న న్యూడెమోక్రసీ నాయకుడు కేవీ రమణ

జంగారెడ్డిగూడెం: లబ్ధిదారులకు వెంటనే టిడ్కో ఇళ్లు ఇవ్వాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. సోమవారం జంగారెడ్డిగూడెం ధర్మన్న స్మారక భవనంలో ప్రజా సంఘాల జాయింట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేవీ రమణ మాట్లాడుతూ ఏడేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం నిరుపేదలకు టిడ్కో ఇళ్లు మంజూరు చేశారని, ఇంటికి ఒక్కొక్క దానికి రూ.50 వేల చొప్పున కట్టించుకొని ఇక డబ్బులు కట్టనవసరం లేదని పేర్కొన్నారన్నారు. అయితే ఇప్పటివరకు ఆ ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు. ఇప్పుడు బ్యాంకు వారు లబ్ధిదారులకు ఫోను చేసి రూ.2.26 లక్షలు బాకీ ఉందని వెంటనే కట్టాలని లబ్ధిదారులపై ఒత్తిడి చేస్తున్నారని, లబ్ధిదారులకు ఉన్న వేరే బ్యాంక్ అకౌంట్లను లావాదేవీలు జరగకుండా సీజ్ చేస్తున్నారని, ఇది దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. ఇంతవరకు ఇల్లు ఇవ్వకుండా వడ్డీలు, అసలు కట్టమనడం చాలా హాస్యాస్పదంగా ఉందని రమణ విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఆనాడు డబ్బులు కట్టిన లబ్ధిదారులందరికీ ఇళ్లు బాగు చేసి వెంటనే ఇవ్వాలని బ్యాంకుకు ఉన్న బాకీలను ప్రభుత్వమే భరాయించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని రమణ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు సరియం రామ్మోహన్, ప్రముఖ సీనియర్ న్యాయవాది యు.ఏసుబాబు మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ఎం.శ్రీనివాస్, బొబ్బర సురేంద్ర కుమార్, వాసుబోయిన శ్రీను, తమ్మా సోమలింగ మల్లికార్జున, బాలం నరేష్, కుర్మా మల్లేశ్వరరావు, పీఓడబ్ల్యూ నాయకులు కె.రామలక్ష్మి, యు.శైలజ, ఎం.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలులో వెనుకబాటు

- పన్నుల డిమాండ్ రూ.66.50 కోట్లు
- వసూలైంది రూ.22.37 కోట్లే
- ఇదీ ఏలూరు కార్పొరేషన్ పరిస్థితి


ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం

ఏలూరు (టూటౌన్): పన్నుల వసూళ్లల్లో ఏలూరు కార్పొరేషన్ వెనుకబడింది. మూడో క్వార్టర్ సమయం త్వరలో ముగియనుంది. అయినా ఇంకా మొత్తం డిమాండ్‌లో కేవలం మూడో వంతు మాత్రమే వసూలైంది. పన్నుల వసూళ్ల కోసం ఎన్ని ప్రత్యేక చర్యలు తీసుకున్నా చెల్లించేందుకు ప్రజలు ముందుకు రాకపోవడం వల్లే ఈ పరిస్థితి ఉందని అధికారులు చెబుతున్నారు. మరో వైపు పన్నుల వసూళ్లకు సంబంధించి వార్డు సచివాలయ సిబ్బందిపై వదిలేసి, అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని రాజకీయ ప్రతినిధులు ఆరోపిస్తుండడం విశేషం. ఇటీవల మున్సిపాల్టీల ఆర్జేడీ నాగ నరసింహారావు ఏలూరులో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సైతం పన్నుల వసూళ్లలో వెనుకబడి ఉండటం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

పన్నులు వసూలైతేనే అభివృద్ధి

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో మొత్తం జనాభా 3.70 లక్షల మంది వరకు ఉన్నారు. మొత్తం 50 డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 79 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వివిధ సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి జరగాలంటే కార్పొరేషన్‌లో ఆర్థిక పరిపుష్టి చాలా అవసరం. నగర పాలక సంస్థలో వివిధ రకాల పన్నులు వసూలు చేసేందుకు రెవెన్యూ విభాగం ఎంతో కీలకం. ఈ విభాగం వార్డు సచివాలయ సిబ్బందిపై అజమాయిషీ చేస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. దీంతో పన్నుల వసూళ్లలో వెనుకబడినట్టు పలువురు చెబుతున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే తొమ్మిదో నెల గడుస్తుంది. అయినా ఇప్పటి వరకు ఆస్తి పన్నులో 41 శాతం, ఇతర పన్నుల్లో కేవలం 15 శాతం లోపే వసూలైనట్టు తెలిసింది.

స్పందన కరువు

పన్నుల వసూళ్లకు కార్పొరేషన్ పరిధిలో 8 టీంలు, ప్రచార వాహనాలు ఏర్పాటు చేశారు. పాత బకాయిలు వన్‌టైమ్ సెటిల్మెంట్ చేసుకోవడం ద్వారా పరిష్కరించుకోవచ్చునని చెబుతున్నారు. వన్‌టైమ్ సెటిల్మెంట్‌లో రాయితీ ఇస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభమై ఏప్రిల్ నెలలో చెల్లిస్తే 5 శాతం మేరకు పన్ను రాయితీ ఇస్తున్నారు. అయినా పన్ను చెల్లింపుదారుల నుంచి స్పందన అంతంత మాత్రంగానే కన్పిస్తుంది.

వసూళ్లు ఇలా..

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను డిమాండ్ మొత్తం రూ.48 కోట్లు. ఇప్పటి వరకు రూ.20 కోట్లు మాత్రమే వసూలైంది. ఇది మొత్తం బకాయిలో 41 శాతంగా ఉంది. నీటి పన్ను డిమాండ్ రూ.16 కోట్లు కాగా, రూ.2 కోట్లు మాత్రమే అంటే 13 శాతం వసూలైంది. ఖాళీ స్థలాల పన్ను డిమాండ్ రూ.2.48 కోట్లు కాగా, రూ.37 లక్షలు మాత్రమే వసూలైంది. ఇతర పన్నులు స్టాంప్ డ్యూటీ రిజిస్ట్రేషన్లు, ప్రకటనల ద్వారా దాదాపు రూ.7.50 కోట్లు ఉండగా, కేవలం రూ.కోటి లోపే వసూలైంది.

క్లుప్తంగా

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


కొయ్యలగూడెంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం: క్రీస్తు సందేశం మానవాళికి ఆదర్శనీయమని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. బ్లడ్ రిలేషన్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో పాస్టర్ అబ్రహం, పద్మ సౌజన్యంతో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలకు మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్యాండిల్స్ వెలిగించి కేక్ కట్ చేశారు.

19న ఉచిత నేత్ర వైద్య శిబిరం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం పీహెచ్‌సీలో నిడదవోలు రాజరాజేశ్వరి కంటి హాస్పటల్ బృందంచే ఈనెల 19వ తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నేత్ర వైద్యనిపుణులు చక్రవర్తి పేర్కొన్నారు. రోగులు ఆధార్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డులతో శిబిరానికి హాజరు కావాలని సూచించారు. శిబిరంలో గుర్తించే రోగులకు నిడదవోలులో ఉచితంగా కంటి ఆపరేషన్ నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగే ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

బీసీలు సంఘటితంగా హక్కులు సాధించుకోవాలి


బీసీ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: బీసీలు సంఘటితంగా ఉండి హక్కులను సాధించుకోవాలని బీసీ నాయకులు సూరిబట్ల బుచ్చియాచారి అన్నారు. జంగారెడ్డిగూడెంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో సోమవారం బీసీ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సావిత్రిభాయి పూలే విగ్రహం ప్రతిష్టాపన, సమగ్ర కులగణన, సావిత్రి భాయిపూలే జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని తదితర అంశాలతో తీర్మానం చేశారు. నాయకులు బత్తిన చిన్న, రాజాన పండు, పి.త్రిమూర్తులు, టి.దుర్గారావు, చిట్రోజు తాతాజీ తదితరులు మాట్లాడారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు


మదన గోపాలస్వామి ఆలయంలో తిరునామ ఆకృతిలో దీపాలంకరణ

కొయ్యలగూడెం: ధనుర్మాసం ప్రారంభ సందర్భంగా సోమవారం గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. భక్తులు తెల్లవారుజాము నుంచి వైష్ణవ క్షేత్రాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టెంపుల్స్ సెంటర్లోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాల స్వామి ఆలయంలో అర్చకులు గుడిపూడి శేషాచార్యులు ఆధ్వర్యంలో తిరునామ దీపాలంకరణ నిర్వహించారు. తిరుప్పావై సేవను ప్రారంభించి భోగి పండుగ వరకు కార్యక్రమం నిర్వహిస్తామని శేషాచార్యులు పేర్కొన్నారు.

15 అడుగుల జొన్న మొక్క


పల్లపూరు నిర్వాసిత కాలనీలో వేసిన జొన్న మొక్కలు

బుట్టాయగూడెం: సాధారణంగా జొన్న పంట మొక్కలు 6 నుంచి 8 అడుగుల ఎత్తులో పెరుగుతూ ఉంటాయి. అదే హైబ్రీడ్ మొక్కలైతే 10 నుంచి 15 అడుగుల వరకూ పెరుగుతాయి. అయితే బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం సమీపంలో నిర్మించిన ఆర్‌అండ్‌ఆర్ నిర్వాసిత కాలనీ పల్లపూరులో కట్టుమూరి రామిరెడ్డి నిర్వాసిత గిరిజనుడు తన ఇంటి పెరట్లో వేసిన సాధారణ జొన్న మొక్కలు ఏకంగా 15 అడుగులపైనే పెరిగి చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

వైభవంగా సువర్చలా హనుమద్ కల్యాణం


ప్రత్యేక అలంకరణలో కన్నాపురంలోని శ్రీసువర్చలా సమేత ఆంజనేయస్వామి

కొయ్యలగూడెం: హనుమద్ వ్రత ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం శ్రీ సువర్చలా సమేత హనుమద్ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. సరిపల్లి సమీపంలోని సంజీవ ఆంజనేయస్వామి ఆలయంలో అష్టోత్తర పారాయణం నిర్వహించారు. అదేవిధంగా కన్నాపురంలోని పులిరామన్నగూడెం రోడ్డులోని అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వారసత్వ పట్టా కోసం దరఖాస్తు చేసుకోండి


లింగగూడెంలో మాట్లాడుతున్న తహసీల్దార్

చింతలపూడి: వారసత్వ పట్టాదారు పాస్ పుస్తకం పొందాలనుకున్న వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర సూచించారు. సోమవారం లింగగూడెం, గురుభట్లగూడెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర మాట్లాడుతూ చాలా మంది భూములు వారి పూర్వీకులు, తల్లిదండ్రుల పేరిట ఉన్నాయని, వారి వారసుల పేరిట పట్టాదారు పాసుపుస్తకాలు కావాలంటే పట్టా జిరాక్స్, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, ఫొటోలు జతపరచి సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి.ప్రభావతి, ఉప సర్పంచ్ జి.నరసింహారావు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మూర్తిరాజు జయంతి


మూర్తి రాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక ఛత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చింతలపాటి వరప్రసాదమూర్తి రాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్ ప్రసాద్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మూర్తిరాజు సేవలను కొనియాడారు. విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మహనీయుడు మూర్తిరాజు అని, ఆయన్ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం మూర్తిరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.మధు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.